జాతరకు ముహూర్తపు రాట



రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పోలిపల్లి పైడితల్ల అమ్మవారి జాతరకు ముహూర్తపు రాట ఆలయ ఆవరణలో బుధవారం వేశారు. మార్చి 9 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న 99వ జాతరకు ఈ రాటతో పనులు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఆలయ ఈఓ బీవీ మాధవరావు తెలిపారు. మార్చి 7న నేత్రోత్సవం అనంతరం 9న జాతర ప్రారంభించి 11న ఘటోత్సవంతో ముగింపు ఉంటుందని పేర్కొన్నారు. జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. – రాజాం సిటీ

అంగన్‌వాడీల్లో ఈసీసీఈ ప్రోగ్రాం

బొబ్బిలి మండలంలోని పిరిడి, రంగరాయపురం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ ప్రోగ్రాంను బుధవారం నిర్వహించారు. కేంద్రాల్లోని పిల్లల ఎత్తు, బరువుల కొలతలను చూసి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పౌష్టికాహారం తినిపించే విధానంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. – బొబ్బిలి రూరల్



వేణుగోపాలునికి గరుడ వాహన సేవ



బొబ్బిలి పట్టణంలోని పురాతన రుక్మిణీ సహిత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాంతర్గత ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి గరుడ వాహన సేవను నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు తన్మయత్వం చెందారు. – బొబ్బిలి

క్లుప్తంగా

ఉపాధి పనితీరుపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, హాజరవుతున్న వేతనదారులు, నెలవారీ ఇచ్చిన లక్ష్యాల సాధన, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ బుధవారం సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులతో పాటు క్షేత్ర స్థాయి సహాయకులను కూడా రప్పించి సమీక్షించారు. గ్రామాల్లోని వేతనదారులందరినీ పనిలోకి రప్పించి వారికి పనులు కల్పించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా ఏడు లక్షలకు పైగా పనిదినాలు కల్పించాలన్నారు. గ్రామాల వారీగా నిర్ధిష్ట లక్ష్యాలను ఇచ్చామన్నారు. ఏపీఎం విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ ఎన్నిక



సంఘ ఎన్నికల ప్రతులను ఎంపీడీఓకు అందజేస్తున్న సభ్యులు

బొబ్బిలి రూరల్: మండలంలోని 30 పంచాయతీల కార్యదర్శుల అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు పక్కి మధుసూధనరావు అధ్యక్షతన బుధవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా జి.నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బిఎస్.కృష్ణమ్మ, ట్రెజరర్‌గా ఎన్‌వీ రవీంద్ర కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ఎంపీడీఓ పి.రవికుమార్‌కు ఎన్నిక ప్రతులను అందజేయగా ఆయన సంఘ సభ్యులను అభినందించారు.

పింఛన్ల పంపిణీపై దర్యాప్తు



పెనుబాకలో ఫించన్ పంపిణీపై దర్యాప్తుచేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: రాజాం మండలంలోని బొద్దాం, గార్రాజుచీపురుపల్లి, పొగిరి, పెనుబాక గ్రామాల్లో ఫిబ్రవరి నెలలో పంపిణీ చేసిన పింఛన్లపై ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు బుధవారం దర్యాప్తు చేశారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇచ్చారా.. సచివాలయాలకు రప్పించారా అనే అంశంపై దర్యాప్తు చేసి నివేదికలు తయారు చేశారు. కలెక్టర్‌కు నివేదికలు అందజేయనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.


రామాలయ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయం

వంగర: మండల పరిధి కింజంగి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామ ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. గ్రామస్తులు సమష్టిగా నిర్మించిన ఈ ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆర్నిపల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

సర్వే వేగవంతం చేయాలి



మద్దివలస సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వంగర: గ్రామాల్లో వ్యాపార సంస్థలపై సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీడీఓ లోపింటి త్రినాథ్ అన్నారు. మండల పరిధి కొప్పరవలస, కొండచాకరాపల్లి, మద్దివలస గ్రామ సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కిరాణా షాపులు, మైక్రో, మీడియం, స్మాల్ ఇండస్ట్రీలను గుర్తించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

వంగర: పంటల సాగులో జీవామృతం వినియోగిస్తే చీడపీడల నివారణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం మరువాడ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. బుధవారం కింజంగి గ్రామంలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిపై ఆంక్షలు

- ధర తగ్గించిన విశాఖ డెయిరీ ఏజెన్సీలు
- పాడి రైతుల ఆందోళన
- సంతల్లో పాడి ఆవుల విక్రయాలు
- తగ్గుముఖం పట్టిన పాల ఉత్పత్తి

రేగిడి: జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పోషణ అధికంగా ఉండేది. నిన్నమొన్నటి వరకూ మూడు గేదెలు, ఆరు ఆవులు అన్న చందంగా పాడి పరిశ్రమ కొనసాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు పతనమయ్యాయి. ఉన్నఫలంగా ధరను తగ్గించడంతో పాటు పాలను కేంద్రాలకు విక్రయించే రైతులకు పలు నిబంధనలు పెట్టడంతో పాడి పరిశ్రమ అభివృద్ధిపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. దీంతో పాడి పరిశ్రమను నమ్ముకున్న రైతులు రోడ్డున పడ్డ పరిస్థితి ఏర్పడింది.




విశాఖ డెయిరీ వద్ద పాల సేకరణ

తగ్గిన పాల ఉత్పత్తి

గతంలో జిల్లా వ్యాప్తంగా 4.90 లక్షల పాడి పరిశ్రమ ఉండేది. ఇప్పుడు ఈ సంఖ్య 4.34 లక్షలకు పడిపోయింది. ఇందులో 3.24 లక్షలు పాడి ఆవులు ఉండగా, 1.10 లక్షలు గేదెలు ఉన్నాయి. జిల్లాలో పాడి పశువులు ద్వారా గతంలో రోజుకు 4.27 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి ఉండేది. ప్రస్తుతం 3.80 లక్షల లీటర్లకు ఈ ఉత్పత్తి పడిపోయింది. విశాఖ, హెరిటేజ్ డెయిరీలు రైతులు నుంచి పాలు సేకరిస్తున్నాయి.

తగ్గిన ధరలు

వెన్న శాతం ఆధారంగా డెయిరీలు పాల ధరను రైతులకు గతంలో చెల్లించేవి. ఆవు పాలు లీటరు ధర రూ.35 నుంచి రూ.40లు చెల్లించేవారు. ఇప్పుడు రూ.30లకు పడిపోయింది. గేదె పాలు ధర గతంలో లీటరు రూ.70లు వరకూ ఉండగా, ఇప్పుడు రూ.60లకు పరిమితమైంది. విశాఖ డెయిరీ పాల సేకరణలో గతంలో ముందంజలో ఉండేది. పాల ఉత్పత్తితో 80 శాతం పాలను విశాఖ డెయిరీ కొనుగోలు చేసేది. కూటమి వచ్చిన తరువాత ఈ డెయిరీ పలు నిబంధనలు అమలు చేస్తోంది. ప్రతీ పది లీటర్లు పాలను కేంద్రానికి ఇచ్చిన రైతులు అందులోంచి ఒక లీటరు పాలను వెనక్కు కొనుగోలు చేయాలి. గతంలో ధర కంటే తక్కువ ధరకు విక్రయించాలి. పాలలో తేడాలు ఉన్నాయని నిర్ధారిస్తే పాలను వెనక్కి తీసుకోవాలి. లేదంటే అక్కడే పారబ్రోయాలి.



ఓ పాలసేకరణ కేంద్రం వద్ద పారబోసిన పాలు

పాడి పశువును అమ్ముకుంటున్న రైతులు

పాడి ఆవులు, గేదెల పెంచాలంటే ఖర్చుతో కూడుకున్న పని. రోజుకు ఆరు లీటర్లు ఇచ్చే పాడి ఆవుకు నెలకు రూ. 4 వేల మేర ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చుపెట్టి పాడి పరిశ్రమను సాకుతుంటే పాల ఉత్పత్తి చేసి విక్రయిస్తే డెయిరీలు ఇష్టానుసారం పాల ధరలు తగ్గించి, రైతును ముంచేస్తున్నాయి. కనీసం పాడి ఆవులకు, గేదెలకు ఇన్సూరెన్స్ కూడా ఉండడంలేదు. 11 నుంచి 13 నెలలు ఒక్కో పాడి ఆవు పాలు ఇస్తే, అనంతరం చూడికి వచ్చిన ఆవును 9 నెలలు పాటు కంటికిరెప్పలా కాపాడాలి. గతంలో పశు సంవర్ధకశాఖ కేంద్రాల ద్వారా గ్రామాల్లోని రైతులకు గడ్డి సరఫరా చేసేవారు. ఈ మేతను పాడి ఆవులకు వినియోగించడం ద్వారా ఆవులు పాలు అధికంగా ఉత్పత్తిచేసేవి. ఇప్పుడు వీటి పంపిణీ నిలిచిపోయింది. పైగా రాయితీపై ఇచ్చే గడ్డి విత్తనాలు కూడా ప్రభుత్వం నిలుపుదల చేసింది. దీంతో రైతులు పాడి పరిశ్రమకు గుడ్‌బై చెబుతున్నారు.

ఆవులు అమ్మేస్తున్నాం..



గతంలో విశాఖ డెయిరీ ఫామ్‌కు పాలు ఇచ్చేవాళ్లం. గిట్టుబాటు ధర ఉండేది. మమ్మల్ని ప్రోత్సహించేందుకు స్టీల్ టిన్‌లు, క్యారేజీలు, ఎక్కువ పాలు అందించే రైతులకు బోనస్‌లు ఇచ్చేవారు. ఈ ఐదారు నెలల్లో పరిస్థితి మారిపోయింది. పాల ధర తగ్గించేశారు. చేసేది లేక పాడి ఆవులు అమ్మేస్తున్నాం.

– మీసాల సింహాద్రినాయుడు, పాడిరైతు, కోడిశ, రేగిడి మండలం

అంతా దోపిడీలా ఉంది



విశాఖ డెయిరీ అంటే మంచి పేరుంది. రైతులు ఈ డెయిరీ ఆధారంగానే పాడి పరిశ్రమ అభివృద్ధి చేసేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. పాల ఉత్పత్తిపై ఆంక్షలు పెరిగాయి. కేంద్రానికి పట్టుకెళ్తున్న పాల మొత్తం తీసుకోవడంలేదు. సరైన ధర ఇవ్వడంలేదు. అంతా దోపిడీగా మారిపోయింది. పాల సేకరణ కేంద్రాల వద్ద ఏజెంట్లు లబోదిబోమంటున్నారు.

– శింగవలస లక్ష్మి, పాడిరైతు, వన్నలి, రేగిడి మండలం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లెట్‌ఓవర్ సమీపంలో బైకు ఢీకొన్న సంఘటనలో బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ గవిరెడ్డి రామకృష్ణ తెలిపిన వివరాలు.. కొమరాడ మండలం గుమడకు చెందిన మస్తాన్ అతని భార్య లాల్‌బీ, కుమారుడు అన్వర్, లాల్‌బీ తోటికోడలు షేక్‌షాబీలు దత్తిరాజేరు మండలం దత్తిలో జరిగిన వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి కొమరాడ వెళ్లేందుకు బైకులపై వస్తున్నారు. వీరు బొబ్బిలి ఫ్లెట్‌ఓవర్ వద్ద టీలు తాగేందుకు బైకులు నిలిపి రోడ్డు దాటుతుండగా రామభద్రపురం నుంచి బొబ్బిలి వస్తున్న తెర్లాం మండలం సుందరాడకు చెందిన రాగోలు అభి, చిన్నారావులు బైక్‌తో ఢీకొన్నారు. ఈ ఘటనలో లాల్‌బీ, ఆమె తోటికోడలు షేక్ షాబీలు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం లాల్‌బీని విజయనగరం కేంద్రాస్పత్రికి, షేక్ షాబీని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అభి, చిన్నారావులకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలను సహించేది లేదు'



మాట్లాడుతున్న ఎంఈఓలు త్రినాధరావు, పాపారావు

తెర్లాం: పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణలో లోపాలుంటే సహించేది లేదని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే సంబంధిత పాఠశాలల స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని ఎంఈఓలు త్రినాధరావు, పాపారావు హెచ్చరించారు. తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని స్కావెంజర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు అవసరమైన సామగ్రి ప్రభుత్వం పంపిణీ చేస్తోందని, వాటిని ఉపయోగించి మరుగుదొడ్లను ప్రతీరోజూ స్కావెంజర్స్ శుభ్రం చేయాలన్నారు. స్కావెంజర్స్ అంతా సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం వారికి మరుగుదొడ్లు శుభ్రం చేసే లిక్విడ్‌ను పంపిణీ చేశారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



టెన్త్ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ

తెర్లాం: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని వెలగవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా మంచి మార్కులు తెచ్చుకొనేలా కష్టపడి చదవాలని, ఉపాధ్యాయులు పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఆదివారం, సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. ఆయనతో పాటు హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కనీస వేతనం వచ్చేలా పని చేయండి

బాడంగి: ఉపాధి హామీ వేతనదారులు కనీస వేతనాన్ని పొందే విధంగా పని చేయాలని ఏపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని గజరాయునివలస గ్రామంలోని రైతుల భూములలో భూముల సరిహద్దు గట్లు పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూపులలో నమోదైన వేతనదారులంతా పనుల్లోకి రావాలని, సమయం పాటించాలని సూచించారు. తాగునీరు వెంట తెచ్చుకోవాలన్నారు. కొలతల ప్రకారం పని చేస్తే కనీసం 300రూపాయలకు తగ్గకుండా వేతనాలొస్తాయన్నారు. ఆమె వెంట క్షేత్ర సహాయకుడు నారాయణరావు, మేట్లు ఉన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన



పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీలు

రాజాం సిటీ: గ్రామాల్లోని ప్రజలకు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలని ఎడ్జ్ గ్రేడ్ కంపెనీ ఆర్‌పీలు వెంకటేష్, రాజేష్‌వర్మ అన్నారు. స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో నాలుగు మండలాల సెర్ప్, డీఆర్‌డీఏ సిబ్బందికి బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం స్థాపించడం ద్వారా రాబడి సాధించవచ్చునని అన్నారు. డ్వాక్రా మహిళల ఇళ్లపై సోలార్ రూఫ్ ఏర్పాటుకు గ్రామ స్థాయిలో కృషి చేయాలని, దీనికి రాయితీ వర్తిస్తుందని అన్నారు. సామర్థ్యాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, దీనికి బ్యాంకుల సహకారం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. ఏతః ఎ.చిరంజీవి, ఏపీఎంలు భవాని, గోవింద్, మంగమ్మ, దదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న శిక్షణాధికారి పాపారావు

బొబ్బిలి రూరల్: గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని అప్పుడు ఆశించిన ఫలితాలను పొందగలమని జీపీడీపీ శిక్షణాధికారి పాపారావు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించాలన్నారు. అంతా సమన్వయంతో పని చేస్తే ఆశించిన అభివృద్ధి ఫలాలను పొందవచ్చని వివరించారు. ఎంపీడీఓ పప్పు రవికుమార్, ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో జలకళ



వన్నలిలో నీటితో పుష్కలంగా కనిపిస్తున్న అన్నారాయుని చెరువు

రేగిడి: మండలంలోని పంచాయతీల్లో సాగునీటి చెరువులు జలకళతో కనిపిస్తున్నాయి. గతేడాది ప్రణాళికాబద్ధంగా ఈ చెరువుల్లో ఉపాధి పనులు చేసి, పూడికలు తొలగించారు. కాలువలు ద్వారా వచ్చిన నీరు చెరువుల్లో పుష్కలంగా ఉండడంతో పాటు ఆయకట్టు రైతులకు సక్రమంగా వినియోగపడింది. మడ్డువలస నీటిని విడిచిపెట్టడంతో చెరువుల్లో జలకళ సంతరించుకుంది. మండలంలో మొత్తం 128 సాగునీటి చెరువుల్లో పశువులకు, సాధారణ వినియోగానికి సరిపడే విధంగా నీరు ఉందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ హరనాధరావు వెల్లడించారు.

గడువు పెంపు

రాజాం సిటీ: గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల దరఖాస్తులకు గడువు పొడిగించామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం ఎక్సైజ్ పరిధిలో కల్లుగీత కులాలకు కేటాయించిన మూడు షాపులకు ఈ నెల 5వ తేదీతో గడువు ముగియగా ఈ నెల 8 వరకు పొడిగించామని పేర్కొన్నారు. మద్యం షాపులకు ఎక్సైజ్ కార్యాలయంలోగాని, ఆన్‌లైన్‌లోగాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా...

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

బొబ్బిలి రూరల్: కార్మికుల హక్కులను కాలరాస్తు బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌ను అమల్లోకి తెచ్చిందని దాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని ఎంబూర్జివలస గ్రామంలో బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. లేబర్ కోడ్‌తో కార్మికులకు భద్రత లేదన్నారు. పాత కార్మిక చట్టాలనే పునరుద్ధరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకుడు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోండి

రేగిడి: ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని కొమిర, లక్ష్మీపురం, ఆడవరం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఉపాధి పనులు చక్కగా చేసుకుంటే రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు.

సిలబస్‌ను పూర్తి చేయాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆయా తరగతుల సిలబస్‌ను పూర్తి చేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలో చిన్నశిర్లాంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక, టీఎల్‌ఎమ్ వినియోగం, విద్యార్థులకు బోధించే విధానాలపై ఆరా తీశారు. హెచ్‌ఎం రోజారమణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు

రాజాం: రాజాం మున్సిపాల్టీ పరిధిలో పలు వార్డుల్లో రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. బుచ్చింపేట, జీఎంఆర్‌కేర్ సెంటర్, డోలపేట ప్రాంతాల్లో వీటిని సంబంధిత సిబ్బంది పట్టుకున్నారని, మూడు రోజులు పాటు వాటిని సంరక్షించి అనంతరం అదే వార్డుల్లో విడిచి పెడతామని వివరించారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

వంగర: మండల కేంద్రం వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం జరుగుతుందని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు తనిఖీలు చేపడతారని, కంటి రోగాలుతో బాధపడుతున్న రోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతగా పని చేయాలి



రేగిడి: సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రేగిడి: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ జె.శ్యామలాకుమారి సూచించారు. బుధవారం అంబకండి, ఉంగరాడ, సోమరాజుపేట గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగుల హాజరుపట్టిక, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఉద్యోగులకు సూచించారు.

ఈఓపీఆర్‌డీకి సత్కారం

బొబ్బిలి రూరల్: ఉత్తమ సేవలనందించిన ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావును ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అధికారిగా గుర్తించి కలెక్టర్ అవార్డును అందజేయగా దీనిని పురస్కరించుకుని మండలంలోని కార్యదర్శులు, సిబ్బంది అల్లు భాస్కరరావును సన్మానించారు. కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన కార్యక్రమం

తెర్లాం: మండల కేంద్రం ఐదో అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం కార్యకర్త వై.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజరు ఉషారాణి ఆదేశాల మేరకు బుధవారం ఈసీసీఈ దినోత్సవాన్ని చిన్నారులు, తల్లుల సమక్షంలో నిర్వహించారు.

మంచి ఫలితాలు సాధించాలి

తెర్లాం: పదో తరగతి విద్యార్థులంతా యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన టెస్ట్ పేపర్లను సక్రమంగా వినియోగించుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ జె.త్రినాధరావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టెస్ట్ పేపర్లను బుధవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునిస్వామి, జి.శంకరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బాడంగి: రబీ పంటల సాగు విషయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ కె.శిరీష సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేజేరు, వాడాడ గ్రామాల్లో బుధవారం పర్యటించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏలు సాయికుమార్, సతీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

బాడంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల కోరారు. ఆయన తరపున బుధవారం బాడంగి, కోడూరు ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సంఘ నాయకులు బంకురు జోగినాయుడు, జేసీ రాజు, పి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.